

# టేకిట్ ఈజీ!! - 2

శ్రీనివాస ఫణికుమార్ డొక్కా



# "నో..దో..తె "

*"ఒసేయ్ దంబం, దంబం దోశె తినాలనుందే.."* అన్నాడు చారు మూర్తి బొజ్జ గోక్కుంటూ.

జగదంబ వంటింట్లోంచి ఓ మాటు చూసి *" మీ పిలుపు పిచ్చికలెత్తుకెళ్ళ, ఆ పిలుపేవిటండీ, దంబం దంబం అంటూ, ఏదో స్థంభాన్ని పిలిచినట్టు.."* అని ఇంకా ఏదో అన బోతూంటే మధ్యలో అందుకుని

*" అవునే, పెళ్ళప్పుడు పేప బెత్తంలా ఉండే దానివి ఇప్పుడు ప్రెహ్లాదుడింట్లో స్థంభం లాగ డెవలప్పయ్యావుకదే..అందుకే సర్దా...గా.."* అన్నాడు చారు.

*"దిక్కుమాలిన సరదాలకేంగానీ, దోశె అంటే, ఇలా చిటికేస్తే అలా వచ్చేస్తుందా ఏవిటి? పప్పు నాన పోయాలి, రుబ్బాలి, పెనం కాలాలి, దోశె వెయ్యాలి..మీకు తెలీదూ?"* అంది ఆందోళనగా.

*"నాకు తెలుసే, కానీ ఈ వెధవ జిహ్వ కి తెలీదు. ఊ...తెగ లాగేస్తోంది. సరే, మన టాక్కు డిడక్టబుల్స్ (టి.డి) ఇద్దరినీ త్వరగా రెడీచెయ్యి, ఏదన్నా హోటలుకి పోయి దోశె తినొద్దాం..."* అన్నాడు చారు.

"దో.....శా..." అంది మొదటి టి.డి, ప్రపంచంలో అంతకన్నా ఛెండాలమైనదేదీ లేదన్నట్టు మొహం పెట్టి.

*"కాదే, దో..శ"* అన్నాడు చారు ఆసక్తిగా, అది సరిగా వినలేదేమో అని అనుమానపడుతూ.

*"నాన్నా....నీక్కావస్తే నువ్వు వెళ్ళి దోశె బఫే వేయించుకు తిను, మేము ఆ "ఫలానా", "ఫలానా", "ఫలానా" ( సెన్సారు చేయబడినది )..రెస్టారెంటుకి చచ్చినా రాము, కావాలంటే సోంవారం దాకా డైటింగు చేసి, ఆనక స్కూలుకి పోయి తింటాము "* అని చెప్పేసింది, రెండో టి.డి ఒపీనియన్ కనుక్కోకుండా. రెండో టి.డి కి ఇప్పుడే మాటలొస్తున్నాయి కాబట్టి అది *'దో....తె...', 'దో..తె..'* అంటోంది ముద్దుగా. ఆ మాత్రం సపోర్టు చాలు చారు మూర్తికి. *"పాపం, నోరులేని పిల్ల, దోతె అడుగుతోంది..పదండింక..."* అనేసి,సెంటిమెటుతో కుమ్మేసి, అందరినీ తీసుకుని కారులో కూలేసి, బయల్దేరాడు.

*"నాలుగు పదులు నలభై"* అంటూ ఏదో గొణుగు తోంది దంబం.

*“ఎంత సేపూ నాలుగో ఎక్కవేనా, ఐదో ఎక్కం ఎప్పుడు చెబుతావు పిల్లకి ?"* అన్నాడు చారు.

*"అబ్బా ఎక్కాలు కాదండీ, ఇప్పుడు నలభై డాలర్ల ఖర్చు ఎందుకు? హాయిగా “ఫలానా” హోటలు (సెన్సారు చేయబడినది) కెళ్ళి పిండి తెచ్చుకుందాం. పది డాలర్లలో అయిపోతుంది. ఇంటికొచ్చి ఎంచక్కా దోశెలేసుకుని, ఆవకాయతో తినేయచ్చు..ముప్పై డాలర్ల సేవింగు.."* అంది ఉత్సాహంగా.

దంబం కోరిక ప్రకారం కారు “ఆ” ఫలానా రెష్టారెంటు వద్ద ఆగినది. పిల్లలు కారు దిగలేదు. దంబం ఓ పదిడాలర్లు తీసుకుని లోపలికెళ్ళింది. ఐదు నిమిషాల్లో చేతిలో డొక్కుతో స్కేటింగు చేసుకుంటూ వచ్చింది.

*“అదేవిటే స్కేటింగు ఎప్పుడు నేర్చుకున్నావు?"* అని అడిగాడు అభినందనగా మొహం పెట్టి.

*"స్కేటింగు కాదండీ, వాళ్ళ వంటిల్లంతా పాకుడు పట్టేసింది, అక్కడినించి పిండట్టు కొచ్చేసరికి, నాకు స్కేటింగొచ్చేసింది.."* అంది.

సరే ఎలా వుందో చూద్దామని మూత తీసాడు చారు మూర్తి. అంతే, వెనక సీట్లోంచి *'అమ్మోయ్, నాన్నోయ్, అయ్య బాబోయ్, ఐ కాంట్ బ్రీథ్.."* అంటూ మొదటి టి.డీ గిలగిలా తన్నుకుంటోంది.

జగదంబ **మొహంలో ఏ భావాలు లేని నాన్ లోకల్ హీరోయిన్** లా నిలబడింది. చారు మూర్తి బుర్రలో ఒక బిగ్ బేంగూ, ఒక స్మాల్ బేంగూ - రెండు సార్లు ఠపా, ఠపా మని విస్ఫోటనలు జరిగాయి. పంచేంద్రియాలలో సగం పని చెయడం మానేసాయి. శ్వాస కోశాలు వున్నాయన్న మాటేగానీ, ఇకపై పనిచేస్తాయన్న ఆశ ఏ కోశానా లేదు. అంత పుల్ల వాసన చారు మూర్తి క్రితం జన్మలో కూడా ఎరగడు.

*"నవమి నాడు రుబ్బారుటండీ, ఇవ్వాళ ఇంకా దశమే కదా, రెండ్రోజులన్నా కాలేదు, అప్పుడే పులిసిపోతుందంటారా?"* అంది అమాయకంగా.

*"ఓసినీ సంజాయిషీ సంతకెళ్ళ, వాళ్ళు బహుశా శ్రీరామ నవమి రోజున రుబ్బుంటారు, ఇవ్వాళ విజయ దశమి. నా మాట విని ఆ డొక్కు అవతల పారేసి కారెక్కు. మళ్ళీ కారు కడిగించుకోవలంటే వంద సమర్పించుకోవాలి.."* అనేసి ఆవిణ్ణి పంపించాడు. ఆవిడ ఆ డొక్కు అవతల పారేసొచ్చి కారెక్కింది దిగాలుగా. ఇవేవీ తెలియని రెండో **టి.డి** ఇంకా *"దో..తె, దో..తె"* అంటోంది ముద్దు ముద్దుగా. దాని కమిట్ మెంట్ చూసి ముచ్చటేసింది చారు మూర్తికి. సరే దానిమాటెందుక్కాదనాలీ, అనుకుంటూ మరో రెష్టారెంటు వాకిట్లో వాలిపోయాడు ఐదు నిమిషాల్లో.

అందరూ లోపలికెళ్ళి కూచునే సరికి పది నిముషాలైంది. ఆనక వాడు దిక్కుమాలిన అప్పడాలు ఓ కుళ్ళు వెదురు బుట్టలో పెట్టి పట్టుకొచ్చాడు. అప్పడికే నక నక లాడుతోంది అందరికీని. సరే ఎవరిక్కావలసింది వాళ్ళు ఆర్డరు చేసుకున్నారు. ఆర్డరు తీసుకుని మాయవైపోయాడు అ వెయిటరుగాడు. ఇంక చూడండి, అయిదు, పది, పదిహేను..అరగంట గడిచిపోయింది. అప్పడాలెప్పుడో

అయిపోయాయి. వెదురు బుట్ట కూడా సగమే మిగిలింది. చారు మూర్తికి సహనం చచ్చిపోతోంది. ఒక మాటు లేచి " **సంభవం నీకే సంభవం**" అని పాట మొదలెట్టాడు పిడికిలి బిగించి.

వేరే కుర్రాడు పరిగెత్తుకుంటూ వచ్చి *"తెస్తున్నా సార్..తెచ్చేస్తున్నా"..* అంటూ కూర్చోబెట్టాడు. మరో పదినిమిషాలకి నిజంగానే తెచ్చేసాడు... *" అ..ప్పు..డా..లు..".* .

*"పురేయ్...నాకు కావలసింది దో...శె..."* అన్నాడు చారు మూర్తి కటకటాల రుద్రయ్యలో కృష్ణంరాజులా.

కుర్రాడు లాంగ్ జంపు చేసి కిచెన్లోకి వెళిపోయాడు. అందరూ ఆవేశంగా ఆ దిక్కుమాలిన మిరియాల అప్పడాలు కర కరా నవిలి ఉమ్మేస్తున్నారు. *"కుక్కలు కూడా తినవురా ఈ అప్పడాలు.."* అన్నాడు ఆవేశంగా చారు మూర్తి.

*"అందుకే సార్, లోపల సెర్వ్ చేస్తున్నాం.."* అనేసి పారిపోయాడు కుర్రాడు.

మొదటి టి.డి అప్పటికే సొమ్మ సిల్లి పడిపోయింది. దంబం నాలుగో ఎక్కం చదవటం మానలేదు. రెండో టి.డి మాత్రం ముద్దుగా *"దో..తె..దో..తె"* అంటోంది. దాన్ని చూసి కోపం చల్లారి పోయింది చారు మూర్తికి. దానితో కాస్త కష్టం సుఖం చెప్పుకుందామనిపించి

*"అవునమ్మా, దో..తె..., నీకు, అమ్మకి మసాలా దోతె, అక్కకి ప్లైన్ దో..తె, నాన్న కి రవ్వ దో..తె.."* అని ఆప్యాయంగా ఆ శాల్తీని ఓ మాటు ముద్దెట్టుకున్నాడు. అప్పటికి గెంట గడిచింది.

అప్పుడు మసాలా దో..శె వచ్చింది. దంబం, పిల్ల మొహం మీద నీళ్ళు జల్లి లేపి ఆ దో..శె దానికి తినిపించడం మొదలెట్టింది. మెల్లగా మిగిలినవి కూడ వచ్చాయి. ఆక్షణంలో *"దేవుడున్నాడు"* అనిపించింది చారు మూర్తికి. తన ఆర్డరు ఆబగా తీసుకున్నాడు. ఆదరాబాదరాగా తిందామని చెయ్యి పెట్టాడు. *ఇదేవిటి, అందరికీ స్టీలు ప్లేటుల్లో ఇచ్చి, నాకు ప్లాస్టిక్ ప్లేటులో ఇచ్చాడు, అది కూడా విరిగి ముక్కలైపోయిన ప్లాస్టిక్ ప్లేటులో.., ఛీ..."* అనుకుంటూ, వెయిటర్ని పిలిచాడు.

*"ఏవయ్యా, ప్లాస్టిక్ ప్లేటులో ఇస్తే ఇచ్చావు, మరీ ఇంతల్లా బీటలు తీసి, ముక్కలైపోయిన దాన్లో ఇస్తే ఇలాగయ్యా, చెయ్యి కట్టైపోదూ..."* అన్నాడు ఆందోళనగా...

*"సార్, అది ప్లేటు కాదు, అదే మీ రవ్వా దోశె., దానికింద స్టీలు ప్లేటుంది చూసుకోండి.."* అనేసి వాడు జంపు.

మూర్తి చూసాడు. నిజంగానే స్టీలు ప్లేటుంది. పైన చూసాడు. ఖచ్చితంగా ప్లాస్టిక్ ముక్కలే ఉన్నాయి. దీన్ని రవ్వ దోశె అని ఏ యుగంలో అనేవారో అతనికి ఎంత ఆలోచించినా అర్థం కాలేదు. ఇంతలో మిగిలిన వాళ్ళు తిండి కార్యక్రమం ముగించారు.

*"ఇంక వెళ్దామా"*అంది దంబం.

*"ఎవరికి వారౌ స్వార్థంలో.. టింగ్ టింగ్ టింగ్.."* అంటూ ఆర్కెస్ట్రాతో సహా పాడుకుంటూ బాధపడుతున్నాడు మూర్తి. ప్లేటు చూస్తే కడుపు తరుక్కుపోయింది. ఆ ప్లాస్టిక్ ముక్కల్ని కసిగా నలిపి పొడి చేసి పారేసాడు. ఆ పొడిని నీళ్ళున్న గ్లాసులో వేసి, బాధగా నిట్టూర్చి, ఈ దరిద్రుడికి అసలు టిప్పు వెయ్యను అనుకుంటూ లేచాడు. వెయిటరొచ్చి ఆ పొడి వేసిన నీళ్ళ గ్లాసుని జాగ్రత్తగా లోపలికి

తీసికెళ్ళిపోయాడు, మర్నాటికి మళ్ళీ వాడచ్చనే సదుద్దేశంతో. కౌంటరు దెగ్గిర బిల్లు నలుగురిది, టిప్పు ఆరుగురిది, వాడే కలిపేసుకున్నాడు. ఇంక వాడితో పోట్లాడే ఓపిక లేక, వాడికి చెల్లింపులు చేసి,

*"వచ్చే జెన్మలో నీ రవ్వదోశే నువ్వు రోజూ తిని, వెంఠనే మళ్ళీ చచ్చిపోయి, కుక్కవై పుడతావు.."* అని మనసులో శపించేసి, ఈసురోమని కాళ్ళీడ్చుకుంటూ వచ్చి కారెక్కాడు ఫామిలీతో సహా.

పెద్ద **టి**.డి బుసలు కొడుతూ *"కనీసం ఐస్క్రీమన్నా ఇప్పిస్తావా నాన్నా ? "* అంది బేలగా.

రెండో **టి**.డి *"నో..దో..తె, నో..దో..తె.."* అంటోంది భయం భయంగా...

దంబం ఐదో ఎక్కం చదివి, ***"అమ్మ బాబోయ్, యాభై డాలర్లా?** యీ ముదనష్టపు దో..శె..., ఇంక మళ్ళీ మన పిల్ల పెళ్ళి దాకా హోటలు కెడితే ఒట్టు..."* అని పంచ భూతాల, దెయ్యాల సాక్షిగా ప్రతిజ్ఞ చేసేసింది.

మూర్తి ఇంటికెళ్ళి బుద్ధిగా పప్పు నానబెట్టుకుని, గ్లాసులో మజ్జిగ కలుపుకుని తాగి పడుకున్నాడు, మర్నాడు దంబం వెయ్యబోయే హోం లీ దోశెలు, పల్లీ పచ్చడి రుచి ఊహించుకుంటూ.

పాపం రెండో **టి**.డి మాత్రం నిద్రలో కూడా పలవరిస్తూనే ఉంది.."*నో..దో..తె, నో..నో..దో..తె"* అంటూ..

## (వచ్చే సంచిక దాకా లైట్ తీస్కోండి!)

POST YOUR COMMENTS